క్లుప్తంగా

గీత కార్మికుల అభివృద్ధికి ప్రత్యేక శద్ధ

కల్లుగీత కార్మిక సంఘం
కౌన్సిల్ సభ్యుడు ప్రభాకర్



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

శంకర్‌పల్లి: కల్లు గీత కార్మికుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలంగాణ రాష్ట్ర కల్లుగీత కార్మిక సంఘం కౌన్సిల్ సభ్యుడు ప్రభాకర్ పేర్కొన్నారు. బుధవారం శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలో రాష్ట్ర కార్మిక సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం గీత కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే, సొసైటీలకు ప్రభుత్వం 5ఎకరాల భూమిని కేటాయించాలని, అందులో ఈత, ఖర్జూరం వంటి చెట్లను పెంచేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి మండల గీత కార్మికుల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, సభ్యులు హరిశంకర్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్, నర్సింహులుగౌడ్, అంజయ్యగౌడ్, పాండు గౌడ్, శంకర్‌గౌడ్, రాజుగౌడ్, రాములుగౌడ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీలు నిలిపివేయాలి

టీయూటీఎఫ్ నాయకుడు మునీర్‌పాషా



శంకర్‌పల్లి: అక్రమ ఉపాధ్యాయ బదిలీలను వెంటనే నిలిపివేయాలని టీయూటీఎఫ్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి మునీర్‌పాషా అన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లా ఉపాధ్యాయ అక్రమ బదిలీలకు అడ్డాగా మారిందని పేర్కొన్నారు. జిల్లాలో ఖాళీ లేకున్న వ్యతిరేక పోస్టులను భర్తీ చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. పైరవీలతో బదిలీ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ బదిలీలను ప్రభుత్వ పెద్దలు ప్రోత్సహించడం సరికాదన్నారు. ఇప్పటికైనా ఉన్నతస్థాయి అధికారులు స్పందించి బదిలీలను రద్దుచేసి, పారదర్శకంగా నిర్వహించాలని కోరారు.

వెంకటేష్‌కు సన్మానం



వెంకటేష్‌ను సన్మానిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

కొందుర్గు: మండలంలోని విశ్వనాథ్‌పూర్ గ్రామానికి చెందిన మున్నూరు వెంకటేష్ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అగ్నిపథ్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ నేత పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి విశ్వనాథ్‌పూర్ గ్రామాన్ని సందర్శించి వెంకటేష్‌ను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ యువతకు దేశ సేవ చేయడం కోసం ప్రభుత్వం అగ్నిపథ్ ద్వారా అవకాశం కల్పించడం జరిగిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వెంకటేష్ దేశ సేవ చేయడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. వెంకటేష్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శివారెడ్డి, గోపాల్, అశోక్, ప్రదీప్, సతీష్, సాయిరాం, రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా కల్యాణ మహోత్సవం



కల్యాణం చేస్తున్న పూజారులు

షాద్‌నగర్‌టౌన్: పట్టణంలోని శివ మారుతీ గీతా అయ్యప్ప మందిరంలో బుధవారం శివ పార్వతుల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేళతాళాలతో స్వామి వారిని ఊరేగించారు. అనంతరం కల్యాణోత్సవంలో భాగంగా స్వామి వారికి ఘనంగా ఎదుర్కొళ్లు నిర్వహించారు. కల్యాణోత్సవంలో భక్తులు రవి శర్మ పాల్గొన్నారు.

మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ

మొయినాబాద్: ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని నిరుద్యోగ మహిళలకు స్వయం ఉపాధి రంగాల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ(ఆర్‌సెటీ) డైరెక్టర్ రమేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని చిలుకూరు మహిళా ప్రాంగణం ఆవరణలో ఉన్న ఎస్‌బీఐ ఆర్‌సెటీలో బ్యూటీషియన్, జర్దోసి మగ్గం వర్క్‌లో ఈ నెల 6 నుంచి నెల రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు. పదోతరగతి చదివి 18–45 మధ్య వయసు ఉన్న మహిళలు వెంటనే దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. ఆసక్తి ఉన్న మహిళలు ఎస్‌ఎస్‌సీ మెమో, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్ కాపీలు జతచేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 8639079112, 7981951167, 9000778300 సెల్ నంబర్‌లను సంప్రదించవచ్చన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా విద్యాబోధన

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: పేద విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన చేస్తున్నట్లు ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని రాయికల్, గంట్లవెల్లి గ్రామాల్లోని ప్రభుత్వం పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగానే ప్రభుత్వం మన ఊరు–మన బడి కార్యక్రమాన్ని ప్రారంభించిందని చెప్పారు. విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు సీఎం కేసీఆర్ అనేక చర్యలు చేపడుతున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో దశలవారీగా మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల భవనాలకు మరమ్మతులు చేపట్టడం, రంగులు వేయడం, వంట గది నిర్మాణాలు, అదనపు తరగతి గదుల నిర్మాణాలు, పాఠశాలకు కాంపౌండ్ వాల్, మరుగుదొడ్లు, విద్యుత్, డిజిటల్ తరగతులు, పరిశుభ్రమైన తాగునీరు, పాఠశాలలో డైనింగ్ హాల్స్ ఏర్పాటు వంటి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తుందని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు, ప్రోత్సాహాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని చదువుల్లో రాణించాలని కోరారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గణేష్, ఎంపీపీ ఖాజా ఇద్రీస్ అహ్మద్, జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, ఎంఈఓ శంకర్‌రాథోడ్, ఎంపీడీఓ వినయ్‌కుమార్, వైస్ ఎంపీపీ మౌనిక, ఎంపీటీసీ బార్గవ్‌కుమార్‌రెడ్డి, సిద్దార్థ, సంపత్‌కుమార్, అరుణ, వెంకట్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

కొత్తూరు: ఆపదలో ఉన్నవారికి ఆపద్బాంధువులా సీఎంఆర్‌ఎఫ్ ఆదుకుంటుందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని ఖాజీగూడతండాకు చెందిన ప్రసాద్‌కు అత్యవసర చికిత్స నిమిత్తం బుధవారం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.2.50 లక్షల ఎల్‌ఓసీని ఆయన బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎంఆర్‌ఎఫ్ పథకం పేదలకు ఆర్థికంగా భరోసా కల్పిస్తుందన్నారు. రాష్ట్రం ఏర్పాటైన తర్వాత లక్షలమందికి ఈ పథకం ద్వారా ప్రభుత్వం సహాయం చేసినట్లు గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్‌నాయక్, రవీందర్‌రెడ్డి, రమేష్, జంగయ్య, మెండె కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహేష్‌యాదవ్



గెలుపొందిన టీమ్‌కు చెక్కు అందజేస్తున్న నిర్వాహకులు

మొయినాబాద్‌రూరల్: యువత క్రీడల్లో రాణించినప్పుడే ఆరోగ్యం, సత్సంబంధాలు పెరుగుతాయని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సోమ మహేష్ యాదవ్ అన్నారు. గత 45 రోజుల నుంచి జిల్లాస్థాయిలో దివాకర్‌యాదవ్ జ్ఞాపకార్థంగా నదీమ్‌నగర్ గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్‌ను అశోక్‌యాదవ్ నిర్వహించారు. నదీమ్‌నగర్ గ్రామం, క్రికెట్ ప్లేయర్‌గా పేరున్న వ్యక్తి దివాకర్‌యాదవ్ గత సంవత్సరం ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన జ్ఞాపకార్థంగా జిల్లాస్థాయిలో మొయినాబాద్ మండలంలోని నదీమ్‌నగర్ గ్రామంలో 45 రోజుల క్రితం ఈ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో ఆయా మండలాల నుంచి 24 టీమ్‌లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ముగింపు క్రికెట్ పోటీల్లో ఎన్కెపల్లి, హిమాయత్‌నగర్ తలపడగా హిమాయత్‌నగర్ మొదటిస్థానంలో నిలిచింది. రెండవ స్థానంలో ఎన్కెపల్లి ఉండగా వారికి 25 వేల నగదు అందజేశారు. విన్నర్ టీమ్‌కు లక్ష రూపాయల చెక్కు అందజేశారు. ముఖ్యఅతిథిగా మహేష్‌యాదవ్ పాల్గొని క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో అమ్డాపూర్, కాశింబౌలి, ముర్తుజాగూడ, నదీమ్‌నగర్, ఆయా గ్రామాల యువకులు క్రికెట్ పోటీలకు ఎంతో సహకరించి విజయవంతం చేయడం వారిని సోమ అశోక్ యాదవ్ సంతోషం వ్యక్తం చేశారు.

దేశానికే ఆదర్శంగా సంక్షేమ పథకాలు

జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి



పార్టీలో చేరిన నాయకులతో అవినాశ్ రెడ్డి

చేవెళ్ల: సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా ఉన్నాయని జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పెద్దవేడు గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీఎస్పీ పార్టీల నాయకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా అవినాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీలో చేరేందుకు అన్ని పార్టీల, ప్రాంతాల నాయకులు ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. కుల, మతాలకు అతీతంగా కేవలం అభివృద్ధి తపించేది సీఎం కేసీఆర్ ఒకరేనని ఆయన గుర్తు చేశారు. వ్యక్తగత, సామూహిక అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ పథకాలను రూపొందిస్తున్నారని, అమలు పరుస్తున్నారని చెప్పారు. కార్యక్రమలో నాయకులు యాదగిరి, మల్లేష్, శ్రీధర్, వీరేందర్, అశోక్‌గౌడ్, దేవేందర్‌రెడ్డి, ప్రసాద్, బాలరాజుగౌడ్, కుమార్ యాదవ్, నరేష్‌యాదవ్ తదితరులున్నారు.

అంబరాన్నంటిన బోనాల సంబురం

ఐదు సంవత్సరాల తరువాత బోనాల పండుగ



బోనాల ఉత్సవాల్లో పోతురాజులు, శివసత్తుల పూనకాలు

మొయినాబాద్‌రూరల్: ముర్తుజాగూడ గ్రామంలో బోనాల సంబురం అంబరాన్నంటింది. పోతురాజుల విన్యాసాలు, డప్పుల దరువు, శివసత్తుల పూనకాలతో గ్రామమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. గత ఐదు సంవత్సరాల నుంచి గ్రామంలో బోనాల పండుగకు నోచుకొని భక్తులు పండుగను పెద్దగా నిర్వహించాలని సర్పంచ్ మాణెమ్మ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, నాయకులు నిర్ణయించారు. బుధవారం వేలాది మంది భక్తుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. జంట నగరాల నుంచి వచ్చిన భక్తులతో గ్రామంలో సందడి నెలకొంది.. ఒకే రోజు బోనాల పండుగను జరుపుకోవడం గ్రామం ఆనవాయితీ. అనంతరం మాణెమ్మ మాట్లాడుతూ.. ప్రజలందరు ఆరోగ్యంగా ఉండి పండించే పంటలు, చేస్తున్న ఉద్యోగాలు వారికి సంతోషాన్ని ఇచ్చేలా ఉండాలని మైసమ్మ బోనాల పండుగను నిర్వహిస్తున్నామన్నారు. గత మూడు సంవత్సరాలు కరోనాతో నిర్వహించలేక పోయామని తెలిపారు. ఐదు సంవత్సరాల తరువాత బోనాల పండుగను నిర్వహించడంతో సంతోషంగా బంధుమిత్రులు, స్నేహితులతో కలిసి ఆనందంగా జరుపుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, నాయకులు, యువకులు పాల్గొన్నారు.

నేటి నుంచి లోక్ అదాలత్

ట్రాఫిక్ సీఐ వాసు

చేవెళ్ల: నేటి నుంచి 10వ తేదీ వరకు చేవెళ్ల కోర్టులో ట్రాఫిక్ కేసులపై లోక్‌అదాలత్ కార్యక్రమం నిర్వహించనున్నారని ట్రాఫిక్ సీఐ వాసు తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో ట్రాఫిక్‌కు సంబంధించిన కేసులు పోలీస్‌స్టేషన్‌లో ఉన్న పిట్టి కేసుల పరిష్కరించుకు నేందుకు లోక్ అదాలత్ ఉపయోగపడుతుందని చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన వారు, లైసెన్స్‌లు లేకుండా దొరికినవారి కేసులు, వాహనాలు ట్రాఫిక్ సంబంధించిన కేసులు తదితర వాటిని లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని సూచించారు. 9 రోజుల పాటు చేవెళ్ల కోర్టు ఆవరణలో ఉదయం 9గంటల నుంచి ప్రారంభం అవుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని కేసులు ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓర్జినల్ లైసెన్స్ లేదా ఆర్సీలను వెంట తీసుకొని రావాలని కోరారు. ఇతర వివరాలకు చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని చెప్పారు.

సర్కార్ జాగాను కబ్జా చేసే యత్నం

భూమిని కాపాడాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వ భూమిని అక్రమించి వెంచర్‌ను ఏర్పాటు చేసేందుకు కొందరు రియల్ వ్యాపారులు యత్నిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా రోడ్లు వేసి ప్లాట్లను చేసి విక్రయించేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు. కబ్జా వ్యవహారాన్ని అడ్డుకోవాలని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. అధికారుల తీరుపై అనుమానం వచ్చిన గ్రామస్తులు సదరు భూమిపై కోర్టులో దావా వేశారు. కబ్జా విషయంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి... ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కిషన్‌నగర్ గ్రామ శివారులోని సర్వే నంబర్ 618లో 33–10 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. కోట్ల రూపాయల విలువైన ఈ సర్కారు స్థలంపై రియల్ వ్యాపారుల కన్ను పడింది. సదరు స్థలాన్ని కబ్జా చేసి అక్రమంగా వెంచర్‌ను వేశారు. ఎలాంటి అనుమతులను తీసుకోకుండా ప్రభుత్వ భూమిలో రోడ్డువేసి ప్లాట్లను ఏర్పాటు చేసి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైన విషయంపై గ్రామస్తులు గ్రామస్థాయి నుంచి డివిజన్ స్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు విచారణ చేపడతామని హామీ ఇవ్వడమే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో సదరు భూమిని ప్రభుత్వ భూమిగా డిక్లేర్ చేయాలని కోరుతూ షాద్‌నగర్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో దావా వేశారు. దావా వేసిన విషయాన్ని అధికారులకు విన్నవించినా చర్యలు తీసుకోలేదు. అధికారులకు ఫిర్యాదు చేసిన వివరాలు, కోర్టులో దావా వేసిన విషయాన్ని 2022 అక్టోబర్ 12న జిల్లా డిప్యూటీ కలెక్టర్‌కు గ్రామస్తులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూమి ఆక్రమణ విషయంలో పూర్తిస్థాయి విచారణ చేపట్టి సమగ్ర నివేదిక పంపించాలని డిప్యూటీ కలెక్టర్ ఆదేశించినా అధికారులు విచారణ చేపట్టకుండా నిర్లక్ష్య వైఖరిని అవలంబించారు. సదరు ప్రభుత్వ భూమిలో వెంచర్‌ను ఏర్పాటు చేసేందుకు డీటీసీపీ కార్యాలయం ఎలాంటి అనుమతులను ఇవ్వలేదు. భూమిని ఆక్రమించుకొన్న రియల్ వ్యాపారులు, వారికి సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకొని విలువైన ప్రభుత్వ భూమిని కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అంధత్వ నివారణే లక్ష్యంగా 'కంటి వెలుగు'

జిల్లా మాస్ మీడియా అధికారి నరహరి



వృద్ధుడికి కంటి అద్దాలు అందజేస్తున్న వెంకట్‌రెడ్డి

షాద్‌నగర్: అంధత్వ నివారణే లక్ష్యంగా ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తుందని జిల్లా మాస్ మీడియా అధికారి నరహరి అన్నారు. చించోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఎలికట్ట గ్రామంలో బుధవారం కంటి వెలుగు శిబిరాన్ని నరహరి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం గ్రామాల్లోని నిరుపేదలకు కంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఆరోగ్య సిబ్బంది విధిగా గ్రామాల్లో పర్యటించి ప్రజలను చైతన్య పరిచాలని సూచించారు. అధికారులు, నాయకులు సమన్వయంతో ముందుకు సాగి కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జయప్రకాష్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, సూపర్ వైజర్ చంద్రకళ, ఆనంద్, అశ్విని, సుజాత, సుమతమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కిషన్‌నగర్‌లో శిబిరాన్ని పరిశీలించిన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

మండల పరిధిలోని కిషన్‌నగర్ గ్రామంలో నిర్వహించిన కంటి వెలుగు శిబిరాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులను, శిబిరంలో మౌలిక సదుపాయాలను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ రమాదేవి, సిబ్బంది తుకారాం, శ్రీనివాస్, శ్రీరామ, మెర్లిన్, భారతి, అశ్విని, వెంకటమ్మ పాల్గొన్నారు.

సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

నందిగామ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామస్తులందరు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు, నందిగామ సర్పంచ్ జిలెల్ల వెంకట్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అంతిరెడ్డిగూడలో బుధవారం నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమానికి వెంకట్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. కంటి వెలుగు కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరు తమ కళ్లను ఉచితంగా పరీక్షించుకోవాలని, ఒక వేళ కంటి చూపు సక్రమంగా లేనట్లయితే వైద్యులు ఉచితంగా కంటి అద్దాలు అందజేస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మెక్కొండ కుమార్ గౌడ్, వార్డు సభ్యులు ఈశ్వర్ యాదవ్,సింధు మల్లేష్ యాదవ్,గ్రామ కార్యదర్శి మల్లికారున్, నాయకులు జంగయ్య,శ్రీను, శ్రీశైలం,నర్సింహ, చైతన్య, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి నిధులు మంజూరు

జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి



ప్రొసీడింగ్ కాపీలను అందజేస్తున్న అవినాశ్‌రెడ్డి

చేవెళ్ల: మండల అభివృద్ధికి రూ.11 కోట్ల 70 లక్షల నిధులు మంజూరు చేసినట్లు జెడ్పీటీసీ పట్నం అవినాశ్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో పలువురు సర్పంచ్‌లు, నాయకులతో కలిసి విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి తదితరుల సహకారంతో మండలంలోని అభివృద్ధి కార్యక్రమాలకు కొత్తగా నిధులు మంజూరైనట్లు తెలిపారు. అంతర్గత సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, ప్రహరీ గోడల నిర్మాణాలు, అత్యవసర పనుల కోసం ఈ నిధులను ఎన్‌ఆర్‌ఈజీఎస్, హెచ్‌ఎండీఏ, సీఎం ప్రత్యేక నిధులు, ఎమ్మెల్యే ప్రత్యేక నిధులు, జిల్లా పరిషత్ నిధుల రూపంలో అందాయన్నారు. మండలంలోని 41 గ్రామ పంచాయతీల పరిధిలోని 61 అనుబంధా గ్రామాలకు నిధులను అందేట్లుగా చూస్తామని వివరించారు. ఇందులో భాగంగా ప్రస్తుతం రూ.5 కోట్ల 15 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు, రూ. 2కోట్ల సీఎం ప్రత్యేక నిధులు, రూ.3 కోట్ల నిధులు, మరో రూ.70 లక్షల ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి ప్రత్యేక నిధులను అభివృద్ధి కార్యక్రమాలకు అందించడం జరిగిందన్నారు. పనులను సకాలంలో పనులను పూర్తి చేయాలని తెలిపారు. అందరి సహకారంతో మండలన్ని జిల్లాకే ఆదర్శవంతంగా షాబాద్ మండలాన్ని అన్ని రంగాలలో తీర్చిదిద్దుతామని అవినాశ్‌రెడ్డి స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌ల నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రంతో పాటు రాబోయే రోజుల్లో భారతదేశ అభివృద్ధి జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో జీవన్‌రెడ్డి, కుమ్మరి దర్శన్, మంగమ్మ, శ్రీరాంరెడ్డి, నాయకులు రాజేందర్‌గౌడ్, మధుసూదన్ రెడ్డి, రాందేవ్‌యాదవ్, బల్వంత్‌రెడ్డి, శ్రీనివాస్, సంకేపల్లిగూడ, రాజేందర్‌రెడ్డి, బల్వంత్‌రెడ్డి, తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం



ప్రిన్సిపాల్ రమాదేవి

మొయినాబాద్‌రూరల్: సాంఘిక సంక్షేమ గురుకుల చేవెళ్ల బాలికల పాఠశాల, కళాశాలలో బోధన అధ్యాపకుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని సాంఘిక సంక్షేమ చేవెళ్ల బాలికల పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ రమాదేవి తెలిపారు. బుధవారం ఆమె ఒక ప్రకటనలో పేర్కొంటూ మొయినాబాద్ మండలం తోల్‌కట్ట సమీపంలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల చేవెళ్ల బాలికల పాఠశాల, కళాశాల తాత్కలిక పద్ధతిన ఆంగ్ల మధ్యమంలో బోధించేందుకు ఇంగ్లీషు, గణిత శాస్త్రం, లైబ్రేరియన్ కావాలని తెలిపారు. ఆసక్తి గల వారు ఫిబ్రవరి 2వ తేదీన జిరాక్సులతో తోల్‌కట్ట సమీపంలోని పాఠశాల కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. వివరాల కోసం 79950 10635లో సంప్రదించాలని కోరారు.

ప్రవేశ పరీక్ష దరఖాస్తుకు గడువు పొడిగింపు

సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్(సిఓఈ)లో 2023–2024 సంవత్సరానికి గాను ఇంటర్ అడ్మిషన్‌కు నిర్వహించే ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు ఈ నెల 4వ తేదీ వరకు పొడగించినట్లు తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ రమాదేవి తెలిపారు. ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌లలో అడ్మిషన్ పొందిన వారికి అకాడమీ బోధనతో పాటు ఐఐటీ, నీట్ పరీక్షలకు సంబంధించి ప్రత్యేక శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంగన్‌వాడీ సమ్మెను విజయవంతం చేయండి

సీఐటీయూ నాయకుడు దేవేందర్



మాట్లాడుతున్న దేవేందర్

చేవెళ్ల: అంగన్‌వాడీల రాష్ట్ర వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో గత 40 సంవత్సరాలుగా ఐసీడీఎస్‌లో 70 వేల మంది అంగన్‌వాడీ టీచర్లు పని చేస్తున్నారని చెప్పారు. వారికి ఎలాంటి ఉద్యోగ భద్రత లేదు, ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం లేదు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేవు, పెన్షన్ సౌకర్యం లేదన్నారు. అంగన్‌వాడీ టీచర్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. మార్చిలోగా అంగన్‌వాడీ టీచర్ల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చొరవ చూపాలని లేని పక్షంలో మార్చి 1,2,3 తేదీల్లో రాష్ట్ర వ్యాప్త సమ్మె నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు తదితరులున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం
ఎమ్మెల్సీ అభ్యర్థి లక్ష్మీనారాయణ



పాఠశాలలో ప్రచారం చేస్తున్న లక్ష్మీనారాయణ

చేవెళ్ల: విద్య, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఎమ్మెల్సీ అభ్యర్థి మరెంపల్లి లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం మండల పరిధిలోని హైతాబాద్, పోతుగల్, షాబాద్ బాలుర, బాలిక, తాళ్లపల్లి పాఠశాలలను సందర్శించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్య, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తామన్నారు. ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతుల షెడ్యూలు త్వరలో వస్తుందని తెలిపారు. సీపీఎస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. తనను ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ముందుండి పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి దానయ్య, గౌరవ అధ్యక్షుడు అంజయ్య, హన్మంత్ తదితరులున్నారు.

రోడ్లపై వాహనాలు నిలిపితే చర్యలు

ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లవకుమార్‌రెడ్డి



రోడ్లపై వాహనాలను తొలగిస్తున్న పోలీసులు

మొయినాబాద్: రోడ్లపై వాహనాలు నిలిపితే చర్యలు తప్పవని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లవకుమార్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలో హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై నిలిపిన వాహనాలను తొలగించారు. ఆయన మాట్లాడుతూ.. మొయినాబాద్‌లో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. రోడ్డుకు ఇరువైపుల ఉన్న షాపుల యజమానులు,వ్యాపారులు తమ వద్దకు వచ్చే వినియోగదారులకు పార్కింగ్‌ను సౌకర్యం కల్పించాలన్నారు. రోడ్లపై వాహనాలు పార్క్‌చేస్తే కేసులు నమోదు చేసి చలాన్లు వేస్తామన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా వ్యాపారులు, స్థానికులు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై ఇక్బాల్, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠ



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

కొత్తూరు: మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో బుధవారం నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం వేదపండితులు ఘనంగా నిర్వహించారు. హోమ, యజ్ఞాలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. మహబూబ్‌నగర్ మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డిలతో పాటు పలువురు వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.